ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త !

- తాళాలు వేసిన ఇళ్లపైనే దొంగల నిఘా
- బీరువాలనే టార్గెట్ చేస్తున్న దొంగలు
- అమలుకు నోచుకోని ఎల్‌హెచ్ఎంఎస్ సేవలు
- ముందుగా సమాచారం ఇస్తే నిఘా పెడతామంటున్న పోలీసులు

పెళ్లిళ్లకు ...పండగలకు ఊరెళ్తున్నారా...సెలవులు వచ్చాయని ఇంటిల్లిపాదీ విహార యాత్రలకు వెళ్తున్నారా... తస్మాత్ జాగ్రత్త....మీ ప్రయాణమే వరం అన్నట్లుగా తాళం పడితే చాలు దొంగలు ఇళ్లకు కన్నం వేస్తున్నారు. రాత్రి పూటే కాదు పగలే దొంగతనాలకు తెగబడుతూ.. దాచుకున్న డబ్బులు, బంగారు ఆభరణాలను క్షణాల్లో దోచుకెళ్తున్నారు. ఇంటిల్లిపాది దూరప్రాంతాలకు ప్రయాణం చేసే ముందు ఓ మాట చెబితే దొంగతనాలకు చెక్ పెడతామని పోలీసులు చెబుతున్నారు.


దొంగతనం జరిగిన ఇల్లు (ఫైల్)


దొంగలు పగలగొట్టిన బీరువా (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: ఈ మధ్య కాలంలో పట్టణంలో చోరీలు పెరిగాయి. ఈ చోరీలను పరిశీలిస్తే చాలా వరకు బీరువాలనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. గతంలో రాత్రి పూట తాళం వేసిన ఇంట్లో చోరీలు జరిగేవి, ఇప్పుడు పట్టపగలే తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చాలు కొల్లగొడుతున్నారు. దొంగలు ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే తమ టార్గెట్ బీరువాపై ఉంటుంది. బంగారు ఆభరణాలు, నగదు దాచుకుంటారని వాటినే టార్గెట్ చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాల్సిన అవసరం ఉంది. బీరువాల్లో నగలు, నగదు పెట్టుకో రాదని పోలీసువారు హెచ్చరిస్తున్నారు.

ప్రజలు సహకరిస్తే చోరీలకు ఫుల్ స్టాప్..

ఇంటర్ పరీక్షలు, పదో తరగతి పరీక్షలు ముగిశాయి. అలాగే కొద్ది రోజుల్లో పాఠశాలలకు రెండు నెలల సెలవులు ఇవ్వనుండడంతో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఇతర ఊర్లకు వెళ్తుంటారు. ఏటా ఈ సమయంలోనే దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అంతేకాకుండా తాళాలు వేసి ఉన్న ఇళ్లతో పాటు ఆరుబయట నిద్రించేవారి ఇళ్లనే దొంగలు టార్గెట్ చేసుకొని ఆభరణాలు, డబ్బు కొల్లగొడుతున్నారు. అయితే ఇలాంటి దొంగతనాలు జరగకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ ఏడాది వేసవిలో జరిగే దొంగతనాలను ఫుల్‌స్టాప్ పెట్టేందుకు సహకరించాలని కోరుతున్నారు.

పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలి

సెలవుల్లో వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేసేవారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తమ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం చేరవేయాలి. వేసవిలో ఉక్కపోతతో ఇళ్లల్లో ఉన్నవారంతా ఆరుబయట నిద్రించేందుకు ఆసక్తి చూపుతారు. వీరంతా వారి ఇళ్లల్లో వీలైనంత మేరకు విలువైన వస్తువులను బ్యాంకుల్లో భద్రపరిస్తే మంచిది. ఆయాప్రాంతాల్లో రాత్రి పూట గస్తీ నిర్వహించే పోలీసు సిబ్బందికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలి. యువత అప్రమత్తంగా వ్యవహరించి ఎటువంటి సంఘటనలు జరిగినా తక్షణమే పోలీసులకు తెలియజేయాలి.

పట్టణంలో అమలు కాని ఎల్‌హెచ్ఎంఎస్..

పట్టణంలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్ఎంఎస్) ఇంత వరకు అమలు కాలేదు. ఇతర ప్రాంతాల్లో అమలు అవుతున్నా ఎమ్మిగనూరులో అమలులో లేదు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ అమలులోకి వస్తే దొంగతనాల సులభంగా నివారించవచ్చు. స్మార్ట్‌ఫోన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారి పూర్తి వివరాలు పోలీస్ కంట్రోల్ రూంకు చేరుతాయి. ప్రయాణాలకు వెళ్లే ముందు రోజు ఆరంకెల కోడ్‌తో పోలీస్ రిక్వెస్ట్ ఆప్షన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ యాప్ అమలులోకి వస్తే నమోదు చేసుకున్న వెంటనే పోలీసు సిబ్బంది ఆయ ఇంటికి వెళ్లి ఎల్‌హెచ్ఎంఎస్ పరికరాలను అమర్చుతారు. దీంతో ఇల్లు పూర్తిగా పోలీసుల విభాగంలో కంట్రోల్‌లోకి వెళ్తుంది. ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో ఆగంతకులు ప్రవేశిస్తే నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌లో అలారం మోగుతుంది. దీంతో స్థానిక పోలీసుల అప్రమత్తమై ఆ ఇంటికి చేరుకుంటారు.

విలువైన వస్తువులు బీరువాల్లో ఉంచుకోవద్దు



ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తమ బంగారు ఆభరణాలు, నగదును బీరువాల్లో ఉంచుకోరాదు. దొంగల టార్గెట్ బీరువాలపైనే ఉంటుంది. ఈ విషయంపై ప్రజలకు ప్రతి చోట అవగాహన కల్పిస్తున్నాం. బంగారు ఆభరణాలు, నగదలు బ్యాంకుల్లో లేదా ఇంట్లో ఇతర ప్రాంతాల్లో దాచుకోవాలి. విహార యాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్లే వారు స్థానిక పోలీస్టేషన్‌లో సమాచారం అందిస్తే ఆ ప్రాంతంలో గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా చూస్తాం. మీ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనిపిస్తే సెల్‌ఫోన్‌లో వారి ఫోటోలు తీసుకోవాలి. పట్టణంలో త్వరలో లాక్డ్ హౌస్ మనిటరింగ్ సిస్టమ్‌ను అమలులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం. ప్రజలు ఏదైనా సమాచారం ఉంటే సీఐ-91211 01045, టౌన్ ఎస్ఐ-91211 01147 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

– వి. శ్రీనివాసులు, టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎమ్మిగనూరు

క్లుప్తంగా

గో సంరక్షణకు విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న ఆలయాధికారి

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద ఉన్న గోశాలలోని గో సంరక్షణ కోసం మంగళవారం భక్తులు విరాళాలు అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. డోన్ పట్టణ వాస్తవ్యులైన లక్ష్మీనారాయణగుప్తా, నిర్మల దంపతులు రూ.50వేల నగదు అందజేశారు. దాతకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు ప్రకాశ్‌స్వామి ఉన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీలో వర్క్‌షాప్


ట్రైనర్ కుల్దీప్‌తో ప్రిన్సిపాల్ సుధాకర్

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని ఎర్రకోట వద్దనున్న సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈఈఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఇండస్ట్రీయల్ ఆటోమేషన్ ప్రోగ్రాంబెల్ లాజిక్ కంట్రోలర్ అనే అంశంపై వర్క్‌షాప్‌ను మంగళవారం ప్రారంభించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఉద్యోగాలు సాధించేందుకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని చెప్పారు. రెండు వారాల పాటు జరిగే వర్క్‌షాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రైనర్ కుల్దీప్, ఈఈఈ విభాగపతి డా.కె. చిత్తంబరయ్య శెట్టి, విద్యార్థులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం


కాలి బూడిదైన గడ్డివాములు

కౌతాళం: మండలంలోని తోవి గ్రామంలో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగి రెండు పెద్ద గడ్డివాములు కాలిపోయాయి. గ్రామానికి చెందిన మాదవరం ఈరన్న, చాకలి బసప్పకు చెందిన గడ్డివాములు దగ్ధమవుతున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు స్పందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. పలువురు ఆదోని ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ వచ్చేలోపు గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు.

అధికారులకు సత్కారం


మున్సిపల్ కమిషనర్‌ను సత్కరించిన కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో రంజాన్ పండుగ పర్వదినం ప్రశాంతంగా జరిగేలా అధికారులు కృషి చేశారని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ నాయకులు కౌన్సిలర్ ఖాశింబేగ్, వక్ఫ్‌బోర్డ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్ పేర్కొన్నారు.సోమవారం ఈమేరకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో పాటు పట్టణ సీఐ శ్రీనివాసులును వారు కలిసి సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. రసూల్, హనీఫ్ పాల్గొన్నారు.

బెట్టింగ్ జోలికి వెళ్లకండి


కంబలదిన్నెలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నిరంజన్‌రెడ్డి

పెద్దకడబూరు : క్రికెట్ బెట్టింగ్‌లు, పేకాట, మట్కా వంటి వాటికి పాల్పడి జీవితాలను బుగ్గిపాలు చేసుకోవద్దని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సూచించారు. మండలంలోని కంబలదిన్నె గ్రామంలో సైబర్ నేరాలు, బెట్టింగ్‌లు, రోడ్డు ప్రమాదాలు వంటి వాటిపై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్

ఆదోని సెంట్రల్: స్థానిక విరుపాపురం రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2025కు ఉచిత కోచింగ్ బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ సుధాకర్ రెడ్డి తెలిపారు. పదో తరగతి పూర్తయిన, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోచింగ్ తీసుకునే విద్యార్థికి ఉచితంగా మెటీరియల్ఇస్తామన్నారు. వివరాలకు 81215 55646, 9059291616 సంప్రదించాలన్నారు.

రీసర్వే అభ్యంతరాలపై అప్పీల్‌కు అవకాశం


రైతులకు నోటీసు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో భూమి యజమానులకు 9(2) నోటీసులోని విస్తీర్ణంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సెక్షన్ 11 నోటీసు ద్వారా మొబైల్ మెజిస్ట్రేట్ వారికి అప్పీల్ చేసుకోవచ్చని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. మండలంలో పైలట్ గ్రామంగా ఎన్నికైన పెసలబండ గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు 9(2) నోటీసులు అందజేశారు. గ్రామంలో మొత్తం 1591.58 ఎకరాలు, 474 ఖాతాలు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏడు బృందాలు, ఒక కమ్యూనికేషన్ టీంను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జనవరి 20న ప్రారంభమైన రీ-సర్వే ప్రక్రియలో గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలిడేషన్ పూర్తి చేసి ప్రస్తుతం 9(2) నోటీసులను రైతులకు అందజేసినట్లు చెప్పారు. భూమి యజమానులు నోటీసులో నమోదు చేసిన విస్తీర్ణాలను సరి చూసుకుని, ఏదైనా అభ్యంతరాలు ఉంటే మొబైల్ మెజిస్ట్రేట్ వారికి సెక్షన్ 11 నోటీసు ద్వారా అప్పీలు చేసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ శివరాముడు, రీ సర్వే డీటీ పెద్దయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, మండల సర్వేయర్ ఈశ్వర్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గోనెగండ్ల: మండలంలోని పెద్దనేలటూర్ గ్రామానికి చెందిన శేషం చిన్న రంగన్నపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల దాడి చేయడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. శేషం చిన్న రంగన్న తన ఇంటికి మంచినీటి కుళాయి కోసం పైపులైన్‌కు గుంత తవ్వుతుండగా గ్రామానికి చెందిన అశోక్ అడ్డుకొని తన స్థలంలో వేసుకోవద్దని రంగన్నతో గొడవపడ్డాడు. పైపులైన్ ఎక్కడ నుంచి ఉందో అక్కడి నుండి వేస్తారని గ్రామ సర్పంచ్ చెప్పినప్పటికీ.. అశోక్ వినిపించుకోకుండా చిన్న రంగన్నపై దాడి చేశాడు. కుటుంబ సభ్యులు చిన్నరంగన్నను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆస్పత్రి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చిన్న రంగన్న ఫిర్యాదు మేరకు అశోక్‌తో పాటు మరో ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయండి


జీపుజాతాలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ కర్నూలులో జరిగే జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. మంగళవారం జీపుజాతా దేవనకొండ, విరుపాపురం, గణేకల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదస్సుకు ముఖ్య అతిథులుగా కేరళ వ్యవసాయశాఖ మంత్రి పి.ప్రసాద్, ఏపీ మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరవుతారన్నారు. రైతాంగ సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. రైతులకు సాగునీరు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సదస్సులో చర్చిస్తామన్నారు. అలాగే ఈనెల 15, 16, 17వ తేదీల్లో తమిళనాడులో జరిగే జతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు భీమన్న, కడప హనుమంతు, గోపాల్ పాల్గొన్నారు.

కరువు మండలాలుగా గుర్తించాలి


గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని మూడు మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జిల్లాలో కేవలం తొమ్మిది మండలాలను మాత్రమే కరువు మండలాలుగా గుర్తించడం దారుణమన్నారు. నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు,గోనెగండ్ల,నందవరం మండలాలను పరిగణలోకి తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. వాతావరణం అనుకూలించక, సరైన వర్షాలు లేక పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సింది పోయి ద్రోహం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు నియోజవర్గంలో పర్యటించి రైతులతో మాట్లాడి పంటల సాగు పరిస్థితి, దిగుబడులను తెలుసుకొని రైతులకు పంట నష్ట పరిహారం అందించాలన్నారు. ప్రభుత్వం జాబితాలో చేర్చకపోతే రైతులతో కలిసి ఉద్యమాలకు పూనుకుంటామని హెచ్చరించారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమం



హైస్కూల్ ఆవరణలో నినదిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమించక తప్పదని ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు కరెకృష్ణ, తాలూకా నాయకులు విజి.వెంకట్రాముడు,వెంకటేశ్వర్లు,దావీదు,మాదన్న పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం స్థానిక హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.12వ పీఆర్సీ కమీషన్‌ను నియమించాలని,30శాతం ఐఆర్ మంజూరు చేయాలని కోరారు.ఎల్లప్ప, అడివన్న, రామన్న,కౌలన్న, వెంకటేషప్ప, వీరనాగేంద్ర,దేవపాల్, జయన్న, రాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


పింఛన్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని అర్బన్: కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని బీజేపీ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి ఆదూరి విజయ్‌కృష్ణ అన్నారు. మంగళవారం పింఛన్ లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పింఛన్‌లు పంపిణీ చేశారు.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే పార్థసారధి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ కర్నూలు జిల్లా కార్యదర్శి రమాకాంత్, నాయకులు చంద్ర, శ్రీకాంత్, తాయన్న, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 32వ వార్డులో లబ్ధిదారులకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు.

నేడు ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఆదోని రూరల్: ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. ఇరు ప్యానెళ్ల నుంచి అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులు మధుసూదన్‌రెడ్డి, శ్రీరాములు బరిలో ఉన్నారు. ఉపాధ్యక్షుడిగా లోకేష్‌కుమార్, జె.వెంకటేశ్వర్లు పోటీలో ఉండగా, కార్యదర్శి పదవులకు ఎల్.కె.జీవన్‌సింగ్, నెట్టేకంటయ్య పోటీ పడుతున్నారు. సంయుక్త కార్యదర్శిగా రాజారత్నం, ఖలందర్ బాషాలు పోటీలో ఉన్నారు. 303 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు ఎన్నికల అధికారి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుందని చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతూ, మట్కా రాస్తు పట్టుబడిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హనుమంత రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగంలో కొల్మాన్‌పేట గ్రామానికి చెందిన దిద్దిగేని గోపాల్, చిర్తనకల్లు గ్రామానికి చెందిన బురుగేని గోపాల్, తలారి ఆంజనేయులు నుంచి 330 మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే మట్కా చీటీలు, రూ.6,250 నగదు పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ తరలించినట్లు చెప్పారు.

తహసీల్దార్‌ను నియమించండి

పెద్దకడబూరు : మండలానికి రెగ్యూలర్ తహసీల్దారు లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని సీపీఐ కార్యవర్గసభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, సహాయ కార్యదర్శి చంద్ర అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆదోని - పెద్దకడబూరు ప్రధాన రహదారిలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు చిరవకు ఇన్‌చార్జ్ తహసీల్దారును కూడా కేటాయించకపోవడంతో 11గంటలైనా సిబ్బంది కార్యాలయానికి రావడం లేదని మండిపడ్డారు. దీంతో ప్రజలు, రైతులు పనులు వదులుకొని రోజులు, నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఏఐవైఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జాఫర్‌పటేల్, ఏఐఎస్ఎఫ్ మండలకార్యదర్శి షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం అధికారులకు ఎంతవరకు సమంజసమని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న,జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపణ్ణ గౌడ్ ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. పెద్దకడుబూరు మండల తహసీల్దార్‌ను సమస్యలపై ఆ మండల కార్యదర్శి వీరేష్ ప్రశ్నిస్తే ఆయనపై అక్రమ కేసు బనాయించారని మండిపడ్డారు. ప్రజలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా వారి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రశ్నించిన సీపీఐ నాయకుడిని కార్యాలయం నుంచి బయటికి వెళ్లమని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు


పెద్దకడబూరు ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఆదోని డివిజన్ పరిధిలోని ఆదోని, పత్తికొండ, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు 247 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో రెగ్యూలర్, ప్రైవేట్ విద్యార్థులు 20,153 మంది పరీక్షలు రాశారు. పరీక్షల నిర్వహణ కోసం డివిజన్‌లో 98 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదోని నియోజకవర్గంలో 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. చివరి రోజు ఆయా కేంద్రాల్లో మొత్తం 3,831 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 3,795 మంది హాజరయ్యారు. 36 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంతో కేంద్రం నుంచి బయటకు వచ్చారు. విద్యార్థుల కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు, స్నేహితులు, ఆత్మీయులు పరీక్షలు ఎలా రాసారంటూ పలకరించుకోవడం కనిపించింది. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ముగిసిన పది పరీక్షలు

కోసిగి: పదవ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 17న ప్రారంభమై మంగళవారం ముగిశాయి. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సెంటర్-ఎలో 183 మందికి గానూ 178 హాజరయ్యారు. సెంటర్-బిలో 220మందికి గానూ 214 హాజరుకాగా, బాలికల ఉన్నత పాఠశాలలో 169 మందికి గానూ 159 మంది, మౌంట్‌కార్మెల్ పాఠశాలలో 135 మందికి గానూ 128 హాజరైనట్లు ఎంఈఓ-2 శోభరాణి తెలిపారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మంగళవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.ఎంఈఓ సువర్ణల సునీయం మాట్లాడుతూ 546 మంది విద్యార్థులకు 10మంది గైర్హాజరయ్యారన్నారు.

వైఎస్సార్‌సీపీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి నియామకం


మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితో పాండురంగారావు

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ ఆదోని నియోజకవర్గ పెన్షనర్స్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుడు పాండురంగారావును నియమించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పూలమాల, దుశ్శాలువా వేసి సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు ఎంతో మేలు చేశారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించిన విషయాలన్ని మరిచిపోరాదన్నారు. పెన్షనర్స్, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాండురంగారావు తెలిపారు. ఎమ్మెల్సీ మధుసూదన్, కర్నూలు జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి ఉన్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి


జీడీపీ నీటిలో సందడి చేస్తున్న సందర్శకులు

రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలు గాజులదిన్నె ప్రాజెక్టును సందర్శించి సందడి చేశారు. మండలం నుంచే కాకుండా ఎమ్మిగనూరు, కోడుమూరు, దేవనకొండ తదితర ప్రాంతాల నుంచి ముస్లింలు కుటుంబ సభ్యులు, స్నేహితులతో వాహనాల్లో తరలివచ్చి సంతోషంగా గడిపారు. –గోనెగండ్ల


విద్యుత్ దీపాలతో ముస్తాబైన దర్గా


ప్రార్థనలు చేస్తున్న భక్తులు


ఉరేగింపుగా వస్తున్న గురువులు

ఘనంగా ఉరుసు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని తిక్కస్వామి దర్గాలో ఉరుసు మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. గురువులు పూల చాదర్‌ను ఉరేగింపుగా తీసుకొచ్చి దర్గాలో సమర్పించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల మతాలకు అతీతంగా జరిగే ఈ ఉరుసుకు ఆదోని, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.